కథానిక

# పాటమెచ్చిన పార్వతి

"రాంగేయ"

నాకు గంపెడు దుఃఖం వచ్చింది. ఏ డాక్టరన్నా "నీకు క్షయవ్యాధి వచ్చింది!" అన్నా నేనంత దిగులుపడే వాణ్ణికాదు. కాని, భరతారావుకి రేడియోలో పాడే ఛాన్సు వచ్చిందని వినేసరికి నిజంగానే నాకు గంపెడు దుఃఖం వచ్చింది.

భరతారావు రేడియోలో పాడటం ఏమిటి? ఇక వాడికి పట్టపగ్గా లుంటాయా? అసలు వాడు పాడేది పాటేనా! వాడూ ఒక గాయకుడేనా అని! స్కూల్లో మేం నాటకాలువేసే రోజుల్లో రాఘవరావు వ్రాసిన "హిమవన్నగ శోభితా" అనే పాట సారధి హెచ్చు శ్రుతిలో వాయిస్తుంటే, పాడలేక చరణం మధ్యలోనే గొంతుక జీరవోయి బ్రేకాయిలు మొఖం యెరుగని సత్తారు బస్సులాగ పీకు కీచుమంటే మల్లికార్జున రావుగాడు వీడికి ప్లేబాక్ పాడాల్సి వచ్చింది. అటువంటి యేబ్రాసికి యీవేళ రేడియోలో పాడే ఛాన్సు వచ్చిందంటే నాకు ఏడుపుగాక మరేం వస్తుంది!

నాకు ఛాన్సు రాలేదని యేడుపుకాదు గాని, అసలీ రేడియోవాళ్ళకి కళకి విలువ కట్టటమే తెలియదంటాను. హైటూ, వెయిటూ కొలిచే మీటర్లలాగే కళని కొలిచే మీటర్లుకూడా కనిపెట్టి యీ రేడియోవాళ్ళకి సప్లయ్ చేస్తే బాగుండును!

లేకపోతే యేమిటి చెప్పండి! రాఘవయ్య చేసిన సాధన త్యాగయ్యకూడా చేయలేదంటాను. ఫిడేలు మీదే అనుకోండి! అయితేమాత్రం! రాఘవయ్య చేసిన చేస్తూన్న సాధన (తపస్సన్నాకూడా యింకా ఘోర్సు చాలదు) అంతా యింతా కాదు. ఫిడేలుమీద ఎన్ని పోకడలు పోవాలో, కమాన్ ఎన్నివంపులు తిప్పాలో, ఎన్ని స్వరాలు సృష్టించాలో అన్నీ చెయ్యడానికి విశ్వప్రయత్నాలు చేశాడు.

రాఘవయ్య అయితే అవన్నీ వినేవాళ్ళకి వికారాన్నీ, వెటకారాన్నీ కలిగిస్తే అది రాఘవయ్య తప్పుకాదు. రాఘవయ్యలో జీర్ణించిన పిపాసదే ఆ తప్పంతాను. అయినా రాఘవయ్య తృష్ణను కనిపెట్టిన వాళ్ళెవరూ లేరు. పందలకొలది మైళ్ళ దూరంలోవున్న రేడియోవాళ్ళ మాట అటుంచి చివరికి వూళ్ళోనేవున్న కోటయ్యగారు కానీ, నరసయ్య భాగవతారుకానీ, తమ హరికథలకి, అధమం ఒక కథకి - పోనీ చివరికి ఒక పాటకైనా సరే "రాఘవయ్యా! నువ్వు ఫిడేలు వాయించవోయ్!" అని పిలిచిన పాపాన పోలేదు. ఆపాటి ఆదరణే రాఘవయ్యకుంటే యీపాటికి రాఘవయ్య రేడియోలో యేం ఖర్మం, ఏదో ఒక సినిమాసంస్థ ఆర్కెస్ట్రాకి పర్మినెంటు వయొలినిస్టుగా వుండేవాడు. కాని రాఘవయ్యమీద సానుభూతి చూపించిన వారెవరూ లేరు. హార్మోనియంమీద "కలవరమాయె" పాటమాత్రం వాయించడం నేర్చుకున్న సీతయ్యనే అందరూ తమ హరికథలకి హార్మోనిస్టుగా ఎన్నుకున్నాడు.

అసలు కళాతృష్ణే ఒక పెద్ద లోపం! లోపం యేమిటి—తప్పు-తప్పు—పాపమే సుమండీ! అందులోనూ సంగీత పిపాస మరీను! అతగాడెదుర్కోవలసిన కష్టనష్టాలూ, పరాభవాలూ అన్నీయిన్నీ కావు. నా మట్టుకు నా సంగతి చూడండి. పోనీ రాఘవయ్యని రేడియోవాళ్లు గమనించలేదంటే అర్థంవుంది. అతని కళని వూళ్లోవున్న హరిదాసులు గుర్తించలేదూ, అంటే పోనీ అనుకుందాం. కానీ నన్ను మా ఆవిడ-అగ్నిసాక్షిగా పెళ్ళాడిన అర్థాంగి-అడుగడుక్కీ నన్నూ, నా సంగీతాన్నీ అవమానిస్తూ అవహేళన చేస్తూ వస్తూంటే అంటే నేను గాబట్టి వూరుకొన్నానుగాని, మరో పౌరుషంగల మగవాడైతే దాని అంతుకనుక్కోవడమో, లేక తను యేదైనా నుయ్యో గొయ్యో చూసుకోవ

డమో జరిగేది. ఒకనాడూ రేణ్ణాళ్ళూ అయితే పోనీ శ్రీమతి మంచి మూడ్సులో లేదేమో, అందుకని యీ సుముహూర్తంలో మనం పాడ్డం ఆవిడ మనశ్శాంతికి భంగం కలిగించిందేమో: అని సరిపుచ్చుకోవచ్చు. కానీ, వెధవది కాపరం మొదలైన యీ మూడు సంవత్సరాలనుంచీ ఒకటే సత్కారమైతే ఏమనుకునేది! ఏదో తప్పీ, జారీ ఉండబట్టలేక కూనిరాగం తీసేసరికి వంటింట్లోని పాత్రలు రణఠణాదొర్లుతూ బ్యాక్‌గ్రౌండ్ సంగీతం సమకూరుస్తూ వుంటే నా ఖర్మకి నోరుమూసుకోని ఏడవక చేసేదేముంది? అయినా ఆడదానికి అంత అహంభావమూ, మొగుడంటే అంత వెటకారమూ వుండకూడదు. ఆదర్శాలు కలిసిరాని కాపరాలు నరకమే అంటాను. మహాత్ముల పెళ్ళాలంతా యిలాగే అయితే వాళ్ళంతా మహాత్ములయేవారేనా? సీతమ్మవారిలాగా నాతో అరణ్యాలకి రానక్కరలేదే! పోనీ హరిశ్చంద్రుడిలాగ అమ్ముకుంటాననూ అనలేదే! పాండవుల్లాగ జూదంలో కాయనూలేదు. నేను పాడుకుంటానన్నాను. నా పాటని మెచ్చుకోమని కూడా వేడుకోలేదు. తన కిష్టంలేకపోతే చెవులు మూసుకుని దూరంగా వుండమన్నాను. అంతేకాని, చీడపురుగుని చీదరించుకున్నట్లు నన్నూ నా పాటనీ చీదరించుకోవద్దన్నాను! మొగుడు చచ్చినాడు పెళ్ళాంనుండి యీ మాత్రం ఆశించడమే తప్పయితే యిక అంతకన్నా వేరే దౌర్భాగ్యం ఏముంది?

ఎంతకాలమిట్లా సరిపడని కాపురం చేసేది! నే నందగాణ్ణి కానని మా ఆవిడ అంటే ఒప్పుకోనే వాణ్ణి. వందరూపాయిల గుమాస్తాగిరీ కన్నా మరేమీ చేతగానివాణ్ణని యీసడిస్తే నోరు మూసుకునేవాణ్ణి! కాని, మా ఆవిడ నా పాటని—నా జీవితంలో ప్రియతమమైన యీ వాక్కుపిపాసనీ వెక్కిరిస్తే నే సహించడమెట్లా! నా అంద వికారం ఆవిడకి .వికారం కలిగించదు! కాని, నా పాటంటే మా ఆవిడకి చికాకు. ఆ చికాకే నా జీవితాని కొక పెద్ద చీకాకు! పోనీ, ఆవిడకి పాటలంటే ఇష్టంలేదేమో అంటే...ఆ మాట అన్నవారే ప్రపంచంలో పెద్ద ఝూటాకోర్! దగుల్బాజీ!! మా ఆవిడకి పాటలంటే యిష్టమే కాదు. తను పాడుతుంది కూడాను... కాని, అదయినా నేను పాడమన్నప్పుడు కాదు...తన యిష్టంవచ్చినప్పుడు మాత్రమే.

కొంత కొంతమంది దాంపత్యం చూడముచ్చటేస్తూ వుంటుంది. అండాళ్ళమ్మ యెప్పుడూ లేత పసుపురంగు చీరలే కడుతుంది. ఆ చీరలంటే ఆచార్యులగారి కెంతో యిష్టమట! మా వీధిని చింతచిగురు అమ్మకానికి రావడం పాపం! యశోదమ్మ కొననిరోజంటూ వుండదు. చింతచిగురు పచ్చడిచేస్తే వాళ్ళాయన మరోకూరే కలుపుకోడట. ఇంతమంది యిట్లా తమ భర్తల అభిరుచులకి తగ్గట్లు ముద్దుముద్దుగా కాపరాలు చేస్తూ వుంటే నా మొఖాన్నే పొద్దు పొడిచిందోయేమో! మా ఆవిడకి నా పాటలంటేనే గిట్టదు. నా పాట వినేటప్పుడు ఆవిడ ముఖంలో ద్యోతకమయ్యేభావాలు వంటాముదం త్రాగేటప్పుడుకూడా అంత ప్రస్ఫుటంగా గోచరించవు. అంతటితో వూరుకున్నా నేను లక్ష్యపెట్టేవాణ్ణి కాదు. ఆవిడనోరు నా పాటమీద విమర్శ మొదలుపెట్టిందా అంటే "రేడియోసిలన్"లాగ వదల్నే వదల్దు.

నా పాటంటే ఆవిడకంత చులకనెందుకో తెలియదు. నేను పాడుతూ వుంటే...

"వూరుకోండీ! ఎవరన్నా వింటే ఏమనుకుంటారు? నలుగుర్లోనూ నన్ను గయ్యాళిదాన్ననిపించడం సరదా యేమండీ మీకు?" అంటుంది.

ఇంతేకాదు...నేనొకరోజు మల్లెపందిరి పక్కన యీజీచెయిర్‌లో పడుకొని పాడుకొంటూ వుంటే చాకలి అచ్చిగాడు వొచ్చి కేకవేశాడట. ఏమిటి సంగతని మా ఆవిడ అడిగితే "మీ దొడ్లో మా గాడిద వుందండీ...తోలుకుపోతా" నన్నాడట. ఒకొకప్పుడు నా పాటమీద మా ఆవిడ చూపించే కక్ష యింకా విపరీతంగా వుంటుంది.

ఆ మధ్యన మా చంటాడికి నాలుగు రోజుల నుండీ వంట్లో బాగులేదు. ఓనాడు రాత్రి మా ఆవిడ వంటతో సతమతమవుతూ వుంటే నిద్రపోక మారాంచేస్తున్నవాణ్ణి దొడ్లో మంచంమీద పడుకోబెట్టి ఏదో జోలపాట పాడుతున్నా. ఇంతలోకే మా ఆవిడ పరుగెత్తుకొని వచ్చి "ఏమండీ యీ అఘాయిత్యం!..."అని ఒక గావుకేకపెట్టింది.

"ఏమి"టన్నా అదిరిపడి నేను.

"ఏమిటంటూ లేమి టింకాను. సూరమ్మత్త ఏడ్చుకుంటూ పరుగెత్తుకొచ్చింది."

"ఎందుకూ! ఏమయింది?" అన్నా కంగారుగా.

"ఏమయింది! నాఖర్మ కాలింది. వచ్చి ఏమందో విన్నారా? 'నాల్గురోజులాయె చంటాడికి వంట్లో బాగాలేదంటివి. యింతలోకే మీ ఆయన యేడుపు వినిపించేసరికి ఏం అఘాయిత్యం జరిగిందో అని...' బావురుమంటూ వచ్చిందట."

ఏమనను! నా దురదృష్టానికి లోలోపలే ఏడ్చాను. నా సంగీతమే నన్ను కరుణించనప్పుడు మరొకర్ని అని ఏం లాభం?

ఆ రోజునుంచీ అసలు కూనిరాగమైనా తీయకూడదనే ఒట్టుపెట్టుకున్నా. నా పిపాసని లోలోపలే అణచుకోవడానికి ప్రయత్నించా. ఆ కఠోర దీక్షతోనే యివాల్టివరకూ వ్రతం గడిపాను.

అయినా యీవేళ మళ్ళీ నా కర్మకాలింది. మనిషయినవాడు ఏదైనా ఒక వ్యసనానికి అలవాటుపడకనే పోవాలి. అలవాటుపడ్డాక, దాని బారినుండి బయటపడడమంటే మోక్షం.సంపాదించడమే అంటాను. ముఖ్యంగా, అలవాట్లు తప్పించుకోవాలనుకునేవారికి మనోనిబ్బరంతోపాటు, పరిసరాలు కూడా సాయపడాలి సుమండీ! ఈ పాటల పిచ్చి మళ్ళీ రేగుతుందనే, యీ మధ్యని సినిమాలు చూడ్డంకూడా మానేశాను. రేడియో పాడుతున్నా, బలవంతాన చెవులు మూసుకొని దాటిపోయేవాణ్ణి. అయినా, నా నూరునోములూ యీవేళ గంగలో కలిసిపొయ్యాయి. ప్రొద్దుటే లేచి యెవరిమొహం చూశానోయేమో, సాయంకాలం ఆఫీసునుండి వస్తూ వస్తూ, సుబ్బారావు లాక్కుపోతే 'ఉడిపీ'లో కాఫీకోసమని కూలబడ్డాం. వాడి దుంపతెగ! సమయానికి వాడూ మద్రాసే ట్యూన్ చెయ్యాలీ! చేశాడే అనుకోండి, ఆ సమయానికే రాజేశ్వర్రావు రికార్డులు ప్రసారం కావడం ఏమిటి చెప్పండి నా గ్రహచారం కాక పోతే! అసలు మనుషుల్ని రెచ్చగొట్టేవాళ్ళు, వీక్నెస్ ఎక్కడుందో మరీ కనుక్కొని, సరిగ్గా అక్కడే దెబ్బతీస్తారు. దానితో వాడి వెర్రి ఆకాశానికి లేస్తుంది.

రాజేశ్వర్రావుపాటలంటే నాకు మహా యిష్టం. మీరు వేయిచెప్పండి రాజేశ్వర్రావులాగ పాడగల్గేవాడు మన తెలుగువాళ్ళలో లేడంటాను. అతనిది ఆడారి గొంతుకని కొంతమంది అంటే అనొచ్చు. కాని అందులోనే అమృతవాహిని వుందంటాను. రాజేశ్వర్రావు కాక మరెవరు పాడినా 'రజని' సాహిత్యానికి ఆ అందమే వుండదంటాను. రజనీకాంతరావు గుండెని తన గొంతులో యిముడ్చుకొని మరీ పాడతాడు రాజేశ్వర్రావు.

రాజేశ్వర్రావు మెలోడీ నన్ను మళ్ళీ పిచ్చివాణ్ణి చేసింది. యింటికొచ్చి ఫైల్సు పారేసి, కోటువిప్పుతూ...

"చల్లగాలిలో యమునాతటిపై శ్యామసుందరుని మురళీ!"

అంటూ పాడుకుంటున్నాను. నా పాట నా చెవులకి వినిపించడంలేదు. రాజేశ్వర్రావు గొంతులోని తీయదనమే, నా మనసులో కితకితలు పెడుతుంది. ఎంతసేపయిందో ఏమో...మా ఆవిడొచ్చి కాఫీ కప్పు బల్లమీద ఉంచుతూ అంది—

"ఏమండీ! నన్ను నలుగురిలోనూ పరువుగా బ్రతకనీయ దల్చుకోలేదా?"

ఆ మాటల్లో ఛీత్కారంకానీ, హేళనకానీ లేదు.

హతాశుణ్నై ఏమిటన్నట్లు ఆమెకేసే చూస్తున్నా.

"మీ పాటలపిచ్చే మీదికాని, మీపాట ఇతర్ల మనసులో యెంత తుఫాను లేపుతుంతో మీకు తెలీదు. మీరు పాడుతూవుంటే ఎంత కఠోరంగా వుంటుంటో మీ చెవులకి వినిపించదు. వీధిలో వాళ్ళందరికీ, మీరన్నా మీ పాటలన్నా ఎంత చులకనో తెలుసా! నలుగురు స్నేహితురాండ్రూ మీ పాటల పిచ్చిగురించి అవహేళనగా మాటాడుతూ, నన్ను పరిహాసం చేస్తూంటే నేనెట్లా తలెత్తుకు తిరిగేది? మీకు, మీ పాటలపిచ్చే నాకన్నా ప్రియతమమైతే రేపే నన్ను మావాళ్ళింటికి పంపేయండి," అంటూ పార్వతి లోపలికి వెళ్ళిపోయింది. ఈ మాట లంటూవుంటే నిజంగా పార్వతి కళ్ళల్లో నీళ్లు తిరిగాయి.

నేను హతబుద్ధుడిలాగ కుర్చీలో కూలబడిపోయాను. ఈ మాటలనేకంటే, నన్నూ నా పాటనీ పార్వతి తిట్టినా నేనంత బాధపడేవాణ్ణి కాదు. కాని, యీవేళ ఎందుకో పార్వతి తిట్ట

దలచుకోలేదు. తను ఆపుకోలేని బాధతో నా గుండెల్లో బాధ రగిల్చింది.

అలాగే కూర్చొని ఆలోచిస్తున్నా నిజంగా నాపాటల పిచ్చి పార్వతిని యింత బాధిస్తోందా? పాటలు ఆనందంకోసమే అయితే, ఒకర్ని బాధ పెట్టే యీ పాటలపిచ్చిని విడనాడాలి. ఈ మాత్రపు త్యాగం పార్వతికోసం చేస్తాను. అయితే యిది త్యాగం అని, మీరూ వొప్పుకోరు. పార్వతీ ఒప్పుకోక పోవచ్చు. మీరంతా యిది త్యాగమని ఒప్పుకునేముందు, పాటల పిపాస వేరూ, నా జీవితం వేరూ కాదన్న సంగతి తెలుసుకోవాలి. అయితే అంత తీరికా, ఓపికా మీకు లేవు.

ఆలోచనలతోనే సంజెగడిచిపోయింది. పార్వతి దీపం వెలిగించి రెండుమూడు సార్లు భోజనానికి పిలిచినాకూడా నేను లేవకపోవడం చూచి వెళ్ళి పోయింది. ఆలోచనలు అలలలాగ లేస్తూ పడుతూ వున్నాయి.

ఎంతసేపందో యేమో! తలెత్తి చూచాను. గుమ్మందగ్గిర తలుపు ఓరగలబడి నిలుచుంది పార్వతి. దీపపు వెలుగులో పార్వతిని చూశాను. నిజంగా నా కళ్లు మెరిశాయి. ఏమిటిది ఎంత అందంగా తయారైంది పార్వతి! లేత నీలంచీర కట్టుకొని, తెల్లటి లినెన్ రవిక తొడిగి, తల్లో మల్లెపూలు ముడుచుకొంది. పెదవులమీద ముసిముసి నవ్వులు దోబూచులాడు' తున్నాయ్. ఇంతకు ముందే కళ్ళలో అగాధ మేఘాలు చూపించిన పార్వతి పెదవులమీద చిరునవ్వు రేఖలు! కుడిచేయి పైకెత్తి తలుపు పై అంచు పట్టుకొని,

"పాట పాడుమా! కృష్ణ పలుకు తేనె
లొలుకునటుల మాటలాడుమా ముకుంద!"

నా ఉనికిని నేను మర్చిపోయాను. ఎంత తీయగా పాడుతూందాపాట. పార్వతి గొంతులో అమృతపు టల లున్నాయ్. రాజేశ్వరరావు పాడి నప్పుడుకంటే "పాట పాడుమా" అన్న పాట పార్వతి పాడుతూంటే ఎంత మధురంగా వుంది! నిజంగా నా భార్య చికాకుమనిషంటే ఒప్పు కుంటాను. తన మనసులోని మాటని ఎవరి కెంత కష్టం కలిగించేదైనా సరే, ఠపీమని చెప్పేసే మోటుగుండె గలదంటే "ఔను"ని తలూపుతాను. కాని మా ఆవిడకి పాడటం చేతగాదంటే మాత్రం వాళ్ళని నేను సహించలేను. ఎంతహాయిగా పాడు తూందాపాట.

అదేచరణం మళ్ళీ మళ్ళీ పాడుతూ నా వేపు చూస్తూ, వెన్నెల నవ్వులు వొలక బోస్తూంది. ఆ తరవాతి చరణంకూడా ఎత్తుకొని, అలాగే, ఆ పాటంతా అదే తీపితో పాడేస్తే ఎంతబాగుండును! కానీ, అదేమిటి! ఎంతసేపూ అదే చరణం పాడుతూ వుందే! పాట మర్చిపోయిందేమో! అరే! నా మనసు వుండబట్టలేదు. నన్ను నేను మర్చిపోయాను. రాగవరసలో తరువాత చరణం పాడేశాను. కాని, వెంటనే జ్ఞాపకం వొచ్చింది. నేనేం చేస్తున్నాను? మళ్ళీ నేను పాడుతునాన్నా? ఛీ! ఛీ!! నాకు పాడే హక్కులేదు. ఆ హక్కుని పార్వతి సౌఖ్యం కోసం త్యాగం చేశాను.

కాని ఆశ్చర్యం! యీ మాటు పార్వతి నా పాటని విని అసహ్యించుకోలేదు. నవ్వుతూ గబ గబా వచ్చి, నా తలని తన గుండెలకి హత్తుకొని, తన లేతపెదవులతో నా నోరు మూసేసింది.

---

భార్య: అంత శ్రద్ధగా చదువుతున్నారు ఎక్కణ్ణించి వచ్చిందండీ ఆ ఉత్తరం? ఎవరు రాశారు?

భర్త: ఎవరు రాస్తే నీకేం? ఆ వివరాలన్నీ ఎందుకు నీకు?

భార్య: నాకు తెలుసు మీ వరస! చూస్తున్నాను కదూ, మొదటినుండీ మీ కదే జబ్బు! మాటాడితే ప్రశ్నలు ప్రశ్నలు. వివరాలు నా కెందుకని అదో ప్రశ్నా? ప్రతిచిన్నవిషయానికీ యింత కుతూహలం ఉన్న మనిషిని మిమ్మల్నే చూశాను!